సాక్షి
విశాఖపట్నం
గురువారం । 14 । సెప్టెంబర్ । 2023



దేవుడ్ని చేశాం.. దీవించండి

నైపుణ్యం గల కళాకారుల చేతుల్లో గణనాథుడి విగ్రహాలు విభిన్న ఆకృతుల్లో సిద్ధమవుతున్నాయి. 12లో



ఎన్‌సీఎస్‌కు అకడమిక్స్ ట్రోఫీ

ఈఎన్‌సీలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో నేవీ చిల్డ్రన్ స్కూల్‌కు బెస్ట్ ఇన్ అడకమిక్స్ ట్రోఫీ అందజేశారు. 8లో

గోధుమ పిండి అమ్మకాల్లో మాయాజాలం..!

పట్టణ ప్రజలకు పౌష్టికాహారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న గోధుమ పిండి పక్కదారి పడుతోంది. 8లో



న్యూస్‌రీల్

నేడు సీపీగా రవిశంకర్ అయ్యనార్ బాధ్యతల స్వీకరణ



విశాఖ విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న సీపీ రవిశంకర్

దొండపర్తి: విశాఖ పోలీస్ కమిషనర్‌గా డాక్టర్ రవిశంకర్ అయ్యనార్ గురువారం ఉదయం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇప్పటి వరకు సీపీగా విధులు నిర్వర్తించిన డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మను స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్(ఎస్‌పీఎఫ్) ఐజీగా ప్రభుత్వం బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో 1994 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన, ప్రస్తుతం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషినల్ డైరెక్టర్ జనరల్‌గా ఉన్న రవిశంకర్‌ను విశాఖ సీపీగా నియమించింది. అడిషినల్ డైరెక్టర్ జనరల్ హోదా అధికారిని విశాఖ పోలీస్ కమిషనర్‌గా నియమించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. విశాఖ పరిపాలన రాజధాని కానున్న నేపథ్యంలో ఏడీజీ స్థాయి అధికారిని నియమించినట్లు తెలుస్తోంది. అలాగే నూతన డీసీపీ(లా అండ్ ఆర్డర్)గా కంచి శ్రీనివాస్ శనివారం బాధ్యతలు చేపట్టనున్నట్లు సమాచారం.

కొనసాగుతున్న దేహదారుఢ్య పరీక్షలు



పరుగు పోటీలో పాల్గొన్న అభ్యర్థులు

ఆరిలోవ: కైలాసగిరి ఆర్మ్‌డ్ రిజర్వుడ్ పోలీస్ మైదానంలో ఎస్‌ఐ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు కొసాగుతున్నాయి. బుధవారం జరిగే పరీక్షలకు 800 మందికి హాల్ టికెట్లు పంపగా.. 668 మంది హాజరయ్యారు. విశాఖ రేంజ్ డీఐజీ ఎస్.హరికృష్ణ పర్యవేక్షణలో అధికారులు వీరికి పరుగు, లాంగ్ జంప్ పరీక్షలు నిర్వహించారు. అదనపు ఎస్పీ దిలీప్‌కిరణ్, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

- అధికారులకు కలెక్టర్ ఆదేశం



మహారాణిపేట: జిల్లాలో జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లను కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆదేశించారు. వెబెక్స్ ద్వారా ఎస్ఈలు, డీఈలు, ఏఈలు, జీవీఎంసీ, అన్ని మండలాల ఎంపీడీవోలు, కాంట్రాక్టర్లతో బుధవారం ఆయన ఇళ్ల నిర్మాణాల ప్రగతిపై సమీక్ష నిర్వహించారు. ఇంటి నిర్మాణం ప్రారంభించిన ప్రతీ యజమాని పేరిట బ్యాంక్ ఖాతాలు ప్రారంభించాలని సూచించారు. ఇసుక, ఇనుము, సిమెంట్‌ను ఎప్పటికప్పుడు సరఫరా చేయాలని, కూలీల సమస్య లేకుండా చూడాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. కాలనీ ముఖద్వారాల నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలన్నారు. స్టేజ్ అప్‌డేట్‌ను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. సమావేశంలో జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ, హౌసింగ్ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, వీఎంఆర్డీఏ, ఏపీఈపీడీసీఎల్ అధికారులు పాల్గొన్నారు.

ఓటర్ జాబితాపై ఇంటింటి సర్వే పూర్తి

- జేసీ కె.ఎస్.విశ్వనాథన్



మాట్లాడుతున్న జేసీ విశ్వనాథన్

మహారాణిపేట: ఓటర్ల జాబితాలో చేర్పు మార్పులపై ఇంటింటి సర్వే పూర్తి చేసినట్లు జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ వెల్లడించారు. తన చాంబర్‌లో బుధవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఈ ఏడాది జనవరి 6 నుంచి ఈ నెల 12వ తేదీ వరకు చేర్పుల కోసం 61,267, తొలగింపులు 55,274, మార్పులకు 23,702 దరఖాస్తుల వచ్చాయన్నారు. అన్ని రాజకీయ పార్టీలకు వీటి సమాచారం అందజేశామన్నారు. అర్హులైన ఓటర్లను జాబితాలో చేర్చడానికి అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. పార్టీ ప్రతినిధులకు తలెత్తిన సందేహాలను జేసీ నివృత్తి చేశారు. వైఎస్సార్ సీపీ నుంచి కృష్ణకాంత్, పలు పార్టీల నాయకులు, ఎన్నికల సెల్ పర్యవేక్షకుడు సిహెచ్.వి.రమేష్, మూర్తి పాల్గొన్నారు.

అంధుల జీవితాల్లో వెలుగు దివ్వె

పుట్టుకతో కొందరు.. విధి వైపరీత్యంతో మరికొందరు.. మేనరికపు పెళ్లిళ్లతో కలిగే జన్యుపరమైన సమస్యలతో ఇంకొందరు.. కారణాలేమైనా ఇక్కడ చదువుతున్న బాలికలకు కంటి చూపులేదు. కానీ ప్రభుత్వం కల్పిస్తున్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ చదువుల్లో ముందుకు సాగుతున్నారు. మనోనేత్రంతో బాహ్య ప్రపంచాన్ని చూస్తూ బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకుంటున్నారు. చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరుస్తూ తామెవ్వరికీ తీసిపోమని చాటి చెబుతున్నారు. వీరే బీచ్‌రోడ్డు(ఎండాడ)లోని ప్రభుత్వ అంధ బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు.

– విశాఖ విద్య

- ప్రభుత్వ అంధ బాలికల ఆశ్రమ పాఠశాల
- చదువుతో పాటు ఆటల్లోనూ ప్రోత్సాహం
- అంధుల ప్రపంచ కప్ క్రికెట్ పోటీల్లో ఆడిన పూర్వ విద్యార్థిని
- అధునాతన బోధనోపకరణాలతో విద్య
- రాష్ట్రంలోని అంధ బాలికలకు అడ్మిషన్లు

విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంధ విద్యార్థుల కోసం విశాఖపట్నం, విజయనగరం, హిందూపూర్‌లో పాఠశాలలు నిర్వహిస్తున్నారు. బీచ్ రోడ్డు(ఎండాడ)లోని 3 ఎకరాల విస్తీర్ణంలో 1987లో ఈ పాఠశాల ఏర్పాటు చేయగా.. ఇక్కడ బాలికలకు మాత్రమే ప్రవేశాలు కల్పిస్తున్నారు. 6 నుంచి 14 ఏళ్ల వయసు గల 40 శాతంకు పైగా అంధత్వం కలిగిన వారు ఇక్కడ చేరేందుకు అర్హులు. 1 నుంచి 10వ తరగతి వరకు నిర్వహించే ఈ పాఠశాలలో 100 మంది ప్రవేశం పొందేందుకు ప్రభుత్వం నుంచి అనుమతి ఉంది. ప్రస్తుతం 60 మంది బాలికలు చదువుతున్నారు.

కార్పొరేట్‌కు దీటుగా వసతులు

అంధ బాలికల ఆశ్రమ పాఠశాలలో బాలికలకు ఉచిత భోజనం, వసతి సౌకర్యాలు కల్పిస్తున్నారు. విభిన్న ప్రతిభావంతుల శాఖ ఇచ్చే యూనిఫాంతో పాటు జగనన్న విద్యాకానుక వీరికి అందిస్తున్నారు. నాడు-నేడు రెండో దశ కింద ప్రభుత్వం రూ. 27లక్షలు మంజూరు చేయగా.. ఈ నిధులతో పాఠశాల, విద్యార్థినుల అవసరాల మేరకు మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నారు.

పది ఫలితాల్లో శతశాతం ఉత్తీర్ణత

ఎస్‌సీఈఆర్టీ సిలబస్‌తో ప్రభుత్వం బ్రెయిలీ లిపితో ముద్రించిన పుస్తకాలను వినియోగిస్తూనే.. అధునాతన పరికరాలతో ఇక్కడి ఉపాధ్యాయులు పాఠ్యాంశాలు బోధిస్తున్నారు. నాన్ వెర్బల్ డెస్క్ టాప్ అసిస్టెంట్(ఎన్‌వీడీఏ) విధానం ద్వారా కంప్యూటర్ స్క్రీన్ నుంచి వచ్చే శబ్దాలను అనుసరించి కంప్యూటర్లతో సరికొత్త పాఠ్యాంశాలను నేర్చుకుంటున్నారు. డైజీ ప్లేయర్‌లో రికార్డు చేసిన పాఠ్యాంశాలను వింటూ చదువుల్లో ముందుకెళ్తున్నారు. బ్రెయిలీ లిపితో నిక్షిప్తం చేసిన 'అని సిస్టమ్స్'(దివీస్ సంస్థ స్పాన్సర్) విద్యార్థినులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇక్కడి విద్యార్థినులు గత కొన్నేళ్లుగా పదో తరగతిలో శతశాతం ఫలితాలు సాధిస్తున్నారు.

ఆటల్లోనూ మేటి

ఇక్కడి విద్యార్థినులు చదువుతో పాటు ఆటల్లోనూ రాణిస్తున్నారు. ఎం.సత్యవతి అనే పూర్వ విద్యార్థిని ఇటీవల జరిగిన అంధుల ప్రపంచ కప్ క్రికెట్ పోటీల్లో దేశం తరపున ప్రాతినిధ్యం వహించింది. పాఠశాలల్లో వ్యాయామ విద్యకు ప్రాధాన్యం ఇస్తుండటంతో బాలికలు చెస్, వెయిట్ లిఫ్టింగ్ తదితర పోటీల్లోనూ తమ సత్తా చాటుతున్నారు.



టాయ్‌లర్ ఫ్రేమ్‌పై గణితం పాఠ్యాంశాలు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు





విద్యార్థినులకు చెస్ నేర్పుతున్న పాఠశాల హెచ్‌ఎం ప్రసాద్, భోజనాలు చేస్తున్న విద్యార్థినులు

గతంలో కన్నా మార్పు



15 ఏళ్లుగా ఇక్కడే పని చేస్తున్నాను. కంటి చూపు లేదని కుంగిపోకుండా.. మనో ధైర్యంతో అవకాశాలు అందిపుచ్చుకోవాలని విద్యార్థినుల్లో ప్రేరణ కలిగిస్తున్నాం. తోటి ఉపాధ్యాయులంతా ఎంతో సహకరిస్తున్నారు. సంస్థ డైరెక్టర్ బి.రవిప్రకాశ్‌రెడ్డి చొరవతో పాఠశాలలో గతంలో కన్నా సౌకర్యాలు మెరుగయ్యాయి. ఇంకో 40 సీట్లు ఖాళీగా ఉన్నాయి. రాష్ట్రంలోని ఎక్కడ వారినైనా చేర్చుకుంటాం.

–జి.తిరుమల ప్రసాద్, ప్రిన్సిపాల్, అంధ బాలికల ఆశ్రమ పాఠశాల

వారంతా మా పిల్లలే..



నాకూ కంటి చూపు లేదు. అయినా టీచర్ అయ్యాను. మీరు కూడా ప్రయోజకులు కావాలని విద్యార్థినుల్లో స్ఫూర్తి రగిస్తున్నాం. వారంతా మా పిల్లలులాంటి వారే. ప్రభుత్వ ఆశయాల మేరకు వారితో పాటు పాఠశాల అభివృద్ధికి పాటుపడుతున్నాం. వార్డెన్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తూనే.. ప్రైమరీ తరగతులకు బోధిస్తాను.

– ఎస్కే నూర్జహాన్, వసతి గృహాధికారి

ప్రధాని ప్రశంసలు ఆనందాన్నిచ్చాయి



హర్ ఘర్ తిరంగా వేడుక రోజు జాతీయ జెండాను పట్టుకోవడం సంతోషం కలిగించిందని మా సార్‌కు చెబితే.. నా ఫొటో తీసి దాన్ని సోషల్ మీడియాలో పెట్టారు. అది చూసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నన్ను అభినందిస్తూ ఎక్స్(ట్విట్టర్) ద్వారా ప్రశంసించారని మా సార్ చెబితే ఎంతో ఆనందం కలిగింది.

– సుగ్గు మాధురి, 10వ తరగతి

ఇష్టంతో చదువుకుంటున్నాం



పాఠశాలలో సౌకర్యాలు బాగున్నాయి. మా తల్లిదండ్రుల మాదిరే ఇక్కడి ఉపాధ్యాయులు చూసుకుంటున్నారు. అందుకే ఇష్టంతో చదువుకుంటున్నాం. లెక్కలంటే మరీ ఇష్టం. మా టీచర్ అర్థమయ్యేలా ఎంతో బాగా చెబుతారు.

– జి.ప్రవల్లిక, 9వ తరగతి

సీఎం జగన్ దృష్టికి భీమిలి నియోజకవర్గ సమస్యలు

సానుకూలంగా స్పందించారన్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

ఆనందపురం : భీమిలి నియోజకవర్గంలో ప్రజలకు ఉపాధి కల్పనతో పాటు అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు కేటాయించాలని కోరుతూ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో బుధవారం వినతి పత్రం సమర్పించారు. సింహచలం పంచగ్రామాల ప్రజలు యాభై ఏళ్లుగా ఇళ్లు నిర్మించుకొని నివసిస్తున్నారని, ఇప్పుడు ఆ ఇళ్లకు పగుళ్లు ఏర్పడ్డాయని మరమ్మతులకు అవకాశం కల్పించాలని కోరారు. అలాగే ఆనందపురం మండలంలోని కణమాం గ్రామంలో ఏపీఐఐసీకి 150 ఎకరాలు కేటాయించగా అందులో 50 ఎకరాల్లో ఆటోనగర్ నిర్మిస్తున్నారని మిగతా వంద ఎకరాలలో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు చేస్తే వేలాది మందికి ఉపాధి లభిస్తుందని వినతి పత్రంలో కోరారు. నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా భీమిలి మండలం లక్ష్మీపురం, మజ్జివలస, పద్మనాభం మండలం కోరాడ ప్రజలకు చాలా దూరంగా స్థలాలు కేటాయించడంతో వెళ్లడానికి విముఖత చూపిస్తున్నారని... ఆయా గ్రామాల్లోనే అందుబాటులో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు భూముల్లో స్థలాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. నియోజకవర్గంలోని నాగవంశం, యాదవ, మత్స్యకార, నగరాల సామాజికవర్గాలకు సామాజిక వేదికల కోసం స్థలం, నిధులు అందించాలని కోరగా ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ నిరంకుశ విధానాలపై ఉద్యమిద్దాం

ఏఐకేఎంఎస్ ప్రతినిధుల తీర్మానం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వర్రావు

తాటిచెట్లపాలెం: కేంద్ర ప్రభుత్వ నిరంకుశ విధానాలపై ఉద్యమించాలని మాజీ వ్యవసాయ శాఖ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వర్రావు పిలుపునిచ్చారు. ఆలిండియా కేత్ మజ్దూర్ కిసాన్ సభ(ఏఐకేఎంఎస్) ఆధ్వర్యంలో స్థానిక సుబ్బలక్ష్మి కల్యాణ మండపంలో జరుగుతున్న అఖిల భారత ఆదివాసీ సదస్సు బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు ప్రయోజనకరమైన చర్యలన్నీ చేస్తుందన్నారు. మూడు వ్యవసాయ నల్ల చట్టాలు, విద్యుత్ బిల్లు-2020 లాగా అటవీ పరిరక్షణ(సవరణ) చట్టం కూడా ప్రజానీకానికి, పర్యావరణానికి ప్రమాదకరమైందన్నారు. హైకోర్టు న్యాయవాది పల్లా త్రినాథరావు మాట్లాడుతూ అడవులపై ఆదివాసీల జీవనం, సంస్కృతి ఆధారపడి ఉన్నాయని, ప్రస్తుత చట్ట సవరణతో ఆదివాసీలకు ముప్పు ముంచుకొస్తుందన్నారు. సంరక్షణ పేరుతో అందుకు పూర్తి విరుద్ధమైన విధానాలను పాలకులు అనుసరిస్తున్నారన్నారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ మాట్లాడుతూ వలస పాలకుల తరహాలోనే నేటి పాలకులు అడవులను ఆదాయ వనరుగా చేస్తూ అనేక మినహాయింపులతో కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తున్నారని తెలిపారు. అటవీ ప్రాంతాల్లో సమగ్ర అభివృద్ధి కోసం పాలకులపై ఉద్యమించాలన్నారు. ఆయా రాష్ట్రాల నుంచి వచ్చిన ఇతర ప్రతినిధులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2023 అటవీ సంరక్షణ (సవరణ)చట్టం రద్దుకై ఉద్యమిద్దామని తెలిపారు. ఈ చట్టం అటవీ సంపదను, సహజ వనరులను లూటీ చేయడానికి, అటవీ ప్రాంతాల్లోని విలువైన ఖనిజ సంపదను కార్పొరేట్లకు, బహుళ జాతి కంపెనీలకు దోచి పెట్టేందుకు మాత్రమే ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఆలిండియా ట్రైబల్ ఇంటెలెక్చువల్ ఫోరం ప్రధాన కార్యదర్శి ఘాసీరాం, ఏఐకేఎంఎస్ జాతీయ సభ్యుడు శ్రీకాంత్ మహంతి, కో కన్వీనర్ ఎస్. ఝూన్సీ, రైతుకూలీ సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి ఎంఎస్‌నాగరాజు, ఛాషీ మాలియా, ఆదివాసీ సంఘం ఒడిశా ప్రతినిధి పైడమ్మ, తెలంగాణా రైతుకూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌లతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతినిధులతో పాల్గొన్నారు.

అప్పన్న దేవస్థానంలో ఆర్‌వో ప్లాంట్లు ప్రారంభం

దివీస్ లేబొరేటరీస్ సహకారంతో ఏర్పాటు



ఆర్‌వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఈవో త్రినాథరావు

సింహాచలం: వరాహ లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానానికి చెందిన కొండ దిగువ బస్టాండ్, వరాహ పుష్కరిణి వద్ద దివీస్ లేబొరేటరీస్ లిమిటెడ్ ఏర్పాటు చేసిన ఆర్‌వో ప్లాంట్లను బుధవారం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు ప్రారంభించారు. దేవస్థానంలో భక్తులకు స్వచ్ఛమైన మంచి నీటిని అందించేందుకు దివీస్ రూ.96.27 లక్షలతో ఆరు ఆర్‌వో ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చింది. ఇందులో భాగంగా రూ.24 లక్షలతో తొలుత రెండు ప్లాంట్లను ఏర్పాటు చేసింది. దివీస్ జీఎం వై.ఎస్.కోటేశ్వరరావు, కన్సల్టెంట్ వరహాలరెడ్డి, దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, సంపంగి శ్రీనివాసరావు, వారణాసి దినేష్‌రాజ్, పెనుమత్స శ్రీదేవివర్మ, సువ్వాడ శ్రీదేవి, వంకాయల సాయినిర్మల, దశమంతుల రాజ్యలక్ష్మి, పంచాడ పద్మ, ప్రత్యేక ఆహ్వానితుడు చందు యాదవ్, ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, ఏఈ హరి, పీఆర్‌వో నాయుడు పాల్గొన్నారు.

విమ్స్‌లో ఎనస్థీషియా టెక్నీషియన్ పోస్టుల భర్తీలో అక్రమాలు

విచారణకు ఆదేశించిన వైద్య ఆరోగ్య శాఖ



మహారాణిపేట: విమ్స్‌లో భర్తీ చేసిన ఎనస్థీషియా టెక్నీషియన్ల వ్యవహారంపై వైద్య ఆరోగ్యశాఖ విచారణకు ఆదేశించింది. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, విమ్స్ సంయుక్తంగా గతేడాది 13 ఎనస్థీషియా టెక్నీషియన్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసి, అభ్యర్థులను ఎంపిక చేశాయి. ప్రస్తుతం వీరు ఉద్యోగాలు చేసుకుంటున్నారు. అయితే ఏడు పోస్టులను అనర్హులకు కట్టబెట్టారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. ఎనస్థీషియా టెక్నీషియన్ పోస్టులకు భారత సేవా సమితి ఇచ్చిన డిప్లమో పనికిరాదని చెప్పిన అధికారులు.. ఇదే సర్టిఫికెట్ కలిగి ఉన్న కొందరిని మాత్రం ఎంపిక చేశారని సమాచారం. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో ఇంటర్‌లో ఆర్ట్స్ గ్రూప్ తీసుకున్న అభ్యర్థులను ఎంపిక చేశారన్న విమర్శలు వచ్చాయి. అలాగే రూల్ ఆఫ్ రిజర్వేషన్ నిబంధనలు పాటించలేదన్న ఆరోపణలు ఉన్నాయి. మెరిట్, ఎంపిక జాబితాల్లో లేని అభ్యర్థులకు పోస్టులు ఇచ్చారని తెలిసింది. దీనిపై 'సాక్షి' పలు కథనాలు ప్రచురించింది. తాజాగా కొందరు అర్హులైన అభ్యర్థులు తమకు అన్యాయం జరిగిందంటూ రాష్ట్ర వైద్య విద్యాశాఖ డైరెక్టర్ డాక్టర్ నరసింహంకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన డీఎంఈ కేజీహెచ్ అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్ శ్రీనివాసకుమార్‌ను విచారణ అధికారిగా నియమించి.. ఈ నెల 15 లోగా నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఆయన విమ్స్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయాల నుంచి వివరాలు సేకరిస్తున్నారు.

నేడు ఏయూలో జాబ్‌మేళా

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్ గైడెన్స్ బ్యూరో ఆధ్వర్యంలో గురువారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ చీఫ్ కె.దొరబాబు తెలిపారు. డెక్కన్ కెమికల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో ట్రైనీ కెమిస్ట్ విభాగంలో 250, జూనియర్ కెమిస్ట్ విభాగంలో 100 ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. ట్రైనీ కెమిస్ట్‌కు 27ఏళ్ల లోపు వయసు గలవారు అర్హులని, నెలకు వేతనం రూ.19,744 ఉంటుందని తెలిపారు. జూనియర్ కెమిస్ట్‌కు 30 ఏళ్ల లోపు వయసు గలవారు దరఖాస్తు చేసుకోవాలని, వార్షిక వేతనం ఏడాదికి రూ 3.5 లక్షలు అందిస్తారని తెలియజేశారు. డబ్ల్యూఎన్‌ఎస్ గ్లోబల్ సర్వీసెస్‌లో అసోసియేట్ ఆపరేషన్స్ ఉద్యోగానికి టైప్ రైటింగ్‌లో నిమిషానికి 28 పదాలు టైప్ చేయగలిగి, ఏదైనా డిగ్రీ విద్యార్హత కలిగి ఉండాలని తెలిపారు. మొత్తం 258 ఖాళీలు భర్తీ చేస్తామని, 20 నుంచి 35 ఏళ్ల లోపు వయసు కలిగిన వారు అర్హులని, వీరికి నెలకు వేతనంగా రూ.15 వేలు అందిస్తారని వెల్లడించారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ వివరాలను ncs. gov. in లో నమోదు చేసుకోవాలని, ఉదయం 10.30 గంటలకు నేరుగా ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాలకు 96660 92491లో సంప్రదించాలని సూచించారు.

జిల్లా ఉపాధి కార్యాలయంలో..

కంచరపాలెం: జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో గురువారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా సబ్ రీజినల్ ఎంప్లాయిమెంట్ అధికారి నిట్టాల శ్యామ్ సుందర్ తెలిపారు. కల్యాణ్ జ్యువెలర్స్ ఇండియా లిమిటెడ్ కంపెనీలో 50 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు ఏర్పాటు చేశారు. మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలకు ఇంటర్మీడియట్, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత సాధించి 18–35 ఏళ్ల పురుష, మహిళా అభ్యర్థులు అర్హులు. నెలకు జీతం రూ.16,400 ఉంటుంది. అభ్యర్థులు https://www.ncs.gov.in/లో పేర్లు నమోదు చేసుకుని ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు.

రేపటి నుంచి శాస్త్రీయ నృత్యోత్సవాలు

మద్దిలపాలెం : అఖిల భారత శాస్త్రీయ నృత్యోత్సవాలు మద్దిలపాలెం కళాభారతి వేదికగా శుక్రవారం ప్రారంభం కానున్నాయి. నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 15, 16, 17వ తేదీల్లో ఈ నృత్యోత్సవాలను నిర్వహించనున్నామని ఫెస్టివల్ డైరెక్టర్ బి.ఆర్.విక్రమ్‌కుమార్ తెలిపారు. వేడుకల్లో భాగంగా ప్రదానం చేసే పురస్కారాల జాబితాను బుధవారం విడుదల చేశారు. మాస్త్రోగా అంతర్జాతీయ ఖ్యాతిగాంచిన కూచిపూడి, జానపద నాట్య నిపుణుల కొరియోగ్రాఫర్ కళారత్న కె.వి.సత్యనారాయణను వైశాఖీ జీవన సాఫల్య పురస్కారంతో సత్కరించనున్నామని విక్రమ్‌కుమార్ తెలిపారు. డాక్టర్ ఖాజా వెంకట సుబ్రహ్మణ్యం, కూచిపూడి కళాక్షేత్రం సీనియర్ విద్యార్థి కన్నం వెంకటరమణరావులకు వైశాఖీ ఎక్సలెన్స్ అవార్డులతో సత్కరించనున్నామన్నారు. యూఏఈ దుబాయ్‌లో నివసిస్తూ పిన్న వయస్సులో కూచిపూడి నాట్యంలో ఆరితేరిన శ్రావణి తెన్నేటిని వైశాఖీ జాతీయ యువ పురస్కారంతో, పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ నుంచి కూచిపూడిలో డిప్లమో పూర్తి చేసిన తేజశ్రీ బత్తినకు జాతీయ యువ పురస్కారం అందజేయనున్నామని తెలిపారు.

విద్యార్థులకు స్టాంప్ కలెక్షన్ స్కాలర్‌షిప్

మహారాణిపేట: తపాలాబిళ్లలు సేకరించే విద్యార్థులకు కేంద్రప్రభుత్వం ఇస్తున్న స్కాలర్‌షిప్‌నకు దరఖాస్తు చేసుకోవాలని తపాలాశాఖ సీనియర్ సూపరింటెండెంట్ ఒక ప్రకటనలో తెలిపారు. గుర్తింపు పొందిన పాఠశాలల్లో 6 నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ స్కాలర్‌షిప్‌నకు అర్హులని పేర్కొన్నారు. పాఠశాలలో ఫిలాటెలీ క్లబ్ ఏర్పాటై, ఆ విద్యార్థి అందులో సభ్యుడై ఉండాలని, పాఠశాలలో క్లబ్ లేకపోతే విద్యార్థి వ్యక్తిగత ఫిలాటెలీ డిపాజిట్ అకౌంట్ కలిగి ఉండాలని సూచించారు. స్కాలర్‌షిప్‌నకు ఎంపికైన వారికి నెలకు రూ.500 చొప్పున ఏడాదికి రూ.6వేలు ఒక సంవత్సరం ఇస్తారని పేర్కొన్నారు. దరఖాస్తుల కోసం సమీపంలోని పోస్టాఫీసుల్లో సంప్రదించాలని సూచించారు. ఈ నెల 20వ తేదీలోగా ఫిలాటెలీ స్టాంప్ జత చేసి స్పీడ్‌పోస్ట్ ద్వారా పోస్ట్‌మాస్టర్ జనరల్, విశాఖ రీజియన్, ఎంవీపీ కాలనీ చిరునామాకు పంపించాలని వివరించారు.

మీ చిట్టి చేతులతోటే మట్టి గణపతి తయారు చేయండి ఇలా..

సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో

వినాయకుని పుట్టినరోజు ... గణేశ్ చవితి పండుగ వస్తోంది! ఈ రోజున పెద్దవాళ్లు, పెద్ద పెద్ద పందిళ్ల నిర్వాహకులూ పెద్ద పెద్ద విగ్రహాలు తయారు చేసి భారీ ఎత్తున పూజించడం మీకు తెలుసు కదా... అయితే ప్రకృతి ప్రేమికుడైన గణనాయకుడు ప్రకృతి సిద్ధమైన, సులువుగా తిరిగి ప్రకృతిలో కలిసిపోయేలా ఉండే మట్టిగణపతి విగ్రహాలను పూజించే వారికే బోలెడన్ని ఆశీస్సులు అందిస్తాడని మీకు తెలుసు కదా... మట్టి గణపతిని మీ చిట్టి చేతులతో స్వయంగా మీరే తయారు చేసి పూజలో ఉంచి, గణపతికి ఇష్టమైన పిండివంటలు ఆరగింపజేసి, మీ కోరికలన్నీ కోరండేం! సమయం ఆసన్నమైంది. 'అయ్యో! మాకు విగ్రహం తయారు చేయడం రాదే అనో, మా దగ్గర బంకమట్టి లేదు కదా... ఇప్పుడెలా' అనో దిగులు పడకండి. మట్టిగణపతి విగ్రహం తయారు చేసే విధానాన్ని మేమే మీకు నేర్పిస్తాం. ప్రతి సంవత్సరం లాగే ఇప్పుడు కూడా సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారి సహకారంతో మట్టి గణపతి విగ్రహాల తయారీలో మీకు శిక్షణనిచ్చేందుకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తోంది.

ఈ నెల 16వ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో 5 నుంచి 16 సంవత్సరాల లోపు గల బాలలందరూ పాల్గొనవచ్చును. దీనికి ఎటువంటి రుసుము చెల్లించనక్కరలేదు. బంకమట్టిని నిర్వాహకులే ఉచితంగా సమకూర్చుతారు. అయితే మీరు చేయాల్సిందల్లా ఏమిటంటే... దిగువ తెలిపిన నంబర్లకు ఫోన్‌చేసి మీ పేర్లను నమోదు చేసుకోవడమే! ఈ శిబిరంలో పర్యావరణానికి మేలు చేసే విధంగా మట్టిని గణనాయకుని ప్రతిమలుగా రూపొందించే విధానాన్ని నేర్పిస్తారు. మరి ఇంకెందుకు ఆలస్యం ..? మీరు కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మీరు తయారు చేసిన వినాయక ప్రతిమలను ఇంటికి తీసుకు వెళ్లి పూజించండి. శిక్షణకు వచ్చేవారు పాత వాటర్‌బాటిల్, పాతవస్త్రం వెంటతీసుకు రావడం మాత్రం మరచిపోవద్దేం!

అవిఘ్నమస్తు, అభీష్ట సిద్ధిరస్తు.

శిబిరం చిరునామా
రవీంద్రభారతి స్కూల్,
ద్వారకానగర్ ఫస్ట్ లైన్, విశాఖపట్నం
తేదీ : 16-09-2023
సమయం : ఉ. 9.30 నుంచి
మధ్యాహ్నం 12.30 గం.ల వరకు.
రిజిస్ట్రేషన్లకు సంప్రదించాల్సిన
ఫోన్ నంబరు : 70757 09205

రేపటి నుంచి జగనన్న ఆరోగ్య సురక్షపై ప్రచారం



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ మల్లికార్జున, జేసీ విశ్వనాథన్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ

మహారాణిపేట: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై శుక్రవారం నుంచి ఇంటింటి ప్రచారం నిర్వహించనున్నట్టు కలెక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. బుధవారం తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు, వైద్య, విద్యా శాఖ అధికారులతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమం నిర్వహణకు శాఖల వారీగా చేస్తున్న ముందస్తు ఏర్పాట్లను సీఎం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్షపై ప్రజల్లో విస్తృతమైన అవగాహన కల్పించేందుకు ఈ నెల 15 నుంచి ఇంటింటి ప్రచారం, 16 నుంచి ఏఎన్‌ఎం/కమ్యూనిటీ హెల్త్ ఆర్గనైజర్లు సర్వేలో పాల్గొంటారన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ కె.ఎస్.విశ్వనాథన్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు, డీఈవో చంద్రకళ, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

గోధుమ పిండి అమ్మకాల్లో మాయాజాలం..!



గోధుమపిండి

- పక్కదారి పడుతున్న పౌరసరఫరాల శాఖ సరకు
- కిలో రూ.16 చొప్పున గ్రేటర్ పరిధిలో సరఫరా చేస్తున్న ప్రభుత్వం
- ప్రజలకు ఇవ్వకుండా విక్రయించేస్తున్న ఎండీయూలు
- బియ్యం తీసుకునే వేలిముద్రతోనే పిండి విక్రయం
- నగరంలోని హోల్‌సేల్ వ్యాపారులకు రూ.22 నుంచి రూ.25కి విక్రయం
- ఈ నెలలో ఇప్పటి వరకూ 1.50 లక్షల మందికి విక్రయించినట్లు రికార్డులు
- క్షేత్ర స్థాయిలో సగం మందికి కూడా చేరని గోధుమ పిండి

సాక్షి, విశాఖపట్నం : పట్టణ ప్రజలకు పౌష్టికాహారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న గోధుమ పిండి పక్కదారి పడుతోంది. పౌరసరఫరాల శాఖ అధికారుల అండతో ఎండీయూ ఆపరేటర్లు హస్తలాఘవం చూపిస్తున్నారు. ఫలితంగా ప్రజలకు అందాల్సిన గోధుమ పిండి దళారుల గోదాములకు చేరుతోంది. పౌరసరఫరాల శాఖ అందిస్తున్న బియ్యం, పంచదారతోపాటు గోధుమపిండికి కూడా ఒకేసారి వేలిముద్ర వేయాల్సి ఉండటంతో దీన్నే తమ ఆయుధంగా మలచుకుంటున్నారు. ప్రజలకు ఇస్తున్నట్లు రికార్డుల్లోకెక్కిస్తూ.. నగరంలోని హోల్‌సేల్ వ్యాపారులకు గుట్టుచప్పుడు కాకుండా చేరవేస్తున్నారు.

నగరాలు, పట్టణాల్లో బియ్యం కార్డుదారులకు గోధుమ పిండి కూడా పౌర సరఫరాల శాఖ ద్వారా సరఫరా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. తొలి విడతగా అర్బన్ ప్రాంత ప్రజలకు అందిస్తోంది. ప్రతి కార్డుదారుడికి రూ.16కే నాణ్యమైన గోధుమ పిండి సరఫరా చేస్తున్నారు. ఒక్కో కార్డుకి కిలో చొప్పున అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. విశాఖ జిల్లా పరిధిలో ముందుగా అర్బన్ పరిధిలో గోధుమ పిండి పంపిణీ ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా 5.21 లక్షల కార్డులుండగా.. అర్బన్ పరిధిగా ఉన్న జీవీఎంసీలో 4.5 లక్షలకు పైగా రైస్‌కార్డులున్నాయి. వీరందరూ గోధుమ పిండి తీసుకునేందుకు అర్హులే. మొబైల్ డిస్పెన్సరీ యూనిట్స్(ఎండీయూ) వాహనాల ద్వారా రేషన్ పంపిణీ జరుగుతోంది. బియ్యం, పంచదారతోపాటుగా గోధుమ పిండిని కూడా ఈ వాహనాల ద్వారానే విక్రయించాల్సి ఉంటుంది.

హోల్‌సేల్ వ్యాపారులకు విక్రయాలు..!

వాస్తవానికి కార్డుదారులకు కిలో గోధుమపిండి రూ.16కి విక్రయించాల్సి ఉంటుంది. బహిరంగ మార్కెట్‌లో లూజులో అమ్మే గోధుమపిండి కిలో రూ.40 వరకూ విక్రయిస్తున్నారు. బ్రాండ్స్ పేరుతో ప్యాకింగ్‌లో వచ్చే గోధుమ పిండి కిలో రూ.45 నుంచి రూ.50 కిపైగా ఉంటుంది. ఇదే అక్రమార్కులకు లాభాలు తెచ్చిపెడుతోంది. పూర్ణామార్కెట్, గోపాలపట్నం ప్రాంతాల్లో ఉన్న గోధుమపిండి హోల్‌సేల్ వ్యాపారులతో కొందరు ఎండీయూ ఆపరేటర్లు కుమ్మక్కవుతున్నారు. కొందరు అర్బన్ సర్కిల్ పరిధిలోని పౌరసరఫరాల అధికారులు వీరికి అండగా నిలుస్తున్నారు. సర్కిల్ అధికారుల ఆదేశాలతో కొందరు ఎండీయూ ఆపరేటర్లు గోధుమ పిండిని హోల్‌సేల్ వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ఈ వ్యాపారులకు కిలో రూ.22 నుంచి రూ.25 వరకూ చొప్పున అమ్ముతున్నారు. ప్యాకింగ్‌లో వస్తున్న నేపథ్యంలో తనిఖీల్లో పట్టుబడతామని గుర్తించి తెలివిగా వ్యవహరిస్తున్నారు. నిర్జన ప్రాంతాల్లో ప్యాకింగ్స్‌లో ఉన్న గోధుమ పిండిని బస్తాల్లోకి లూజు గోధుమ పిండిగా మార్చేసి హోల్‌సేల్ వ్యాపారుల గోదాములకు పంపిస్తున్నారు. ఇలా ప్రజలకు చేరాల్సిన నాణ్యమైన గోధుమపిండి హోల్‌సేల్ వ్యాపారుల గోదాములకు చేరుతున్నా అడ్డుకట్ట వేయలేకపోతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఒకే వేలిముద్ర లొసుగుతో..

రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేసే బియ్యం, పంచదార, గోధుమ పిండికి ఒకసారి వేలిముద్ర, కేంద్ర ప్రభుత్వం సరఫరా చేసే బియ్యం కోసం మరో వేలిముద్ర వేయాల్సి ఉంటుంది. అయితే కార్డుదారులకు గోధుమ పిండి అందించేందుకు ఎండీయూ ఆపరేటర్లు ప్రజలకు నిరంతరం అవగాహన కల్పించాలని ఉన్నతాధికారులు ఆదేశిస్తున్నారు. అయినప్పటికీ తమ వద్ద గోధుమ పిండి ఉందన్న విషయాన్ని చెప్పకుండా చాలామంది ఎండీయూ ఆపరేటర్లు వినియోగదారులకు అందజేసేందుకు విముఖత చూపిస్తున్నారు. బియ్యం తీసుకునేందుకు థంబ్ వేస్తున్నప్పుడు గోధుమ పిండి కూడా విక్రయిస్తున్నట్లు రికార్డుల్లో నమోదు చేసుకుంటున్నారు. కానీ కార్డుదారులకు మాత్రం అందించడం లేదు. ఎవరైనా గోధుమ పిండి కావాలని అడిగితే తప్ప సరఫరా చేయడం లేదు. ఇలా ఈ నెలలో ఇప్పటి వరకూ 1.52 లక్షల మందికి గోధుమ పిండి అందించినట్లు రికార్డుల్లో నమోదైనా క్షేత్ర స్థాయిలో మాత్రం 50 వేల మందికి కూడా అందజేయలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రాష్ట్రమంతటా ఓబీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి

ఎంవీపీకాలనీ: రాష్ట్రమంతటా ఓబీసీ రిజర్వేషన్లు అమలు చేయాల్సిన అవసరముందని రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు అన్నారు. తన ఆధ్వర్యంలో ఢిల్లీ మహారాష్ట్ర భవన్‌లో జాతీయ వెనుకబడిన కులాల కమిషన్‌ను ఏపీకి చెందిన తూర్పు కాపు కులాల ప్రతినిధులు గొర్లె శ్రీనివాసనాయుడు, కేఎస్‌ఆర్ తదితరులు కలిసినట్లు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రిజర్వేషన్ల అమలు రాష్ట్రంలో పూర్తిస్థాయిలో జరగడం లేదని కమిషన్‌కు వారు వివరించారన్నారు. 2008లో రాష్ట్రమంతటా కాపులకు బీసీ రిజర్వేషన్లు ఇచ్చినప్పటికీ ఓబీసీ రిజర్వేషన్ల అమలుకు ప్రయత్నం చేయలేదని జీవీఎల్ పేర్కొన్నారు. ఈ సమస్యను జాతీయ బీసీ కమిషన్ ఛైర్మన్ దృష్టికి తీసుకెళ్లి, అవసరమైన అన్ని పత్రాలు సమర్పించినట్లు తెలిపారు. ఈ అంశంపై పార్లమెంట్‌లో బిల్లు పెట్టిన అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 50 లక్షల మంది తూర్పు కాపులకు ఓబీసీ రిజర్వేషన్ త్వరలోనే వర్తించనుందన్నారు.

నేటి నుంచి ఇంజినీరింగ్ ఫైనల్ కౌన్సెలింగ్

మురళీనగర్: ఏపీఈఏపీసెట్‌లో ర్యాంకులు సాధించిన వారు ఇంజినీరింగ్ కాలేజీల్లో చేరడానికి ఫైనల్ కౌన్సెలింగ్ గురువారం నుంచి ప్రారంభమై ఈ నెల 17తో ముగుస్తుందని కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.డి.వి.నరసింహారావు తెలిపారు. మొదటి దశ కౌన్సెలింగ్‌లో రిజిస్టర్ చేసుకోని విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించి 15వ తేదీలోగా రిజిస్టర్ చేసుకోవాలన్నారు. విశాఖ ఉమ్మడి జిల్లాకు సంబంధించి కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ కేంద్రంలో ఈ నెల 14 నుంచి 16 వరకు సర్టిఫికెట్లను ఆన్‌లైన్‌లో పరిశీలిస్తారు. వెబ్ ఆప్షన్లు 14 నుంచి 17వ తేదీ వరకు పెట్టుకోవచ్చు. 17న ఆప్షన్ల మార్పిడి, 21న సీట్ల కేటాయింపు ఉంటుంది. సీట్లు పొందిన వారు ఈ నెల 22 నుంచి 25 లోగా సెల్ఫ్ జాయినింగ్ రిపోర్టుతోపాటు సంబంధిత కాలేజీకి వెళ్లి జాయినింగ్ రిపోర్టు ఇవ్వాల్సి ఉంటుంది.

జాడలేని పరారీ ఖైదీ

ఆరిలోవ: కేజీహెచ్ నుంచి పరారైన రిమాండ్ ఖైదీ ఆచూకీ ఇంకా లభించలేదు. అనకాపల్లి జిల్లా చీడికాడ మండలం డొక్కలవారి వీధికి చెందిన కలివలస శ్రీనివాసరావు గంజాయి కేసులో నిందితుడు. కొన్నాళ్లుగా విశాఖ కేంద్ర కారాగారంలో రిమాండ్‌లో ఉన్నాడు. అతనికి అనారోగ్యం కారణంగా ఈ నెల 9న జైల్ సిబ్బంది ఎస్కార్ట్‌తో చికిత్స కోసం కేజీహెచ్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స అనంతరం తిరిగి జైల్‌కు తీసుకొచ్చే సమయంలో ఎస్కార్ట్‌గా ఉన్న జైల్ సిబ్బందికి మస్కాకొట్టి పరారైన విషయం తెలిసిందే. దీంతో జైల్ అధికారులు ఒకటో పట్టణ పోలీసులకు అదే రోజు ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి ఖైదీ ఆచూకీ లభించలేదు. దీంతో జైల్ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఈ నెల 11, 12 తేదీలలో జైళ్ల శాఖ జాతీయ సదస్సు నిర్వహణలో ఇక్కడ అధికారులు తలమునకలై ఉన్నారు. ఈ క్రమంలో ఖైదీ పరారీ వ్యవహారం ఇక్కడి జైల్ అధికారులకు తలనొప్పిగా మారింది. ఎస్కార్ట్ సిబ్బంది నిర్లక్ష్యం వల్లే ఇది జరిగిందంటూ జైళ్ల శాఖ ఉన్నతాధికారులు సైతం ఆగ్రహంతో ఉన్నారు. ఎస్కార్ట్‌గా వెళ్లిన సిబ్బందిపై చర్యలు తీసుకోవడానికి అధికారులు ఉపక్రమించినట్లు తెలిసింది. జైళ్ల శాఖ జాతీయ సదస్సు జరిగే సమయంలో ఈ ఘటన జరగడం అధికారులు జీర్ణించుకోలేకపోతున్నారు.

బ్యాంక్ ఆఫ్ బరోడా ఫెస్టివ్ క్యాంపెయిన్

- 4 కొత్త పొదుపు ఖాతాలు ప్రారంభం
- రుణాలపై ఆకర్షణీయ వడ్డీలు

దొండపర్తి : బ్యాంక్ ఆఫ్ బరోడా 'బీఓబీ కె సంగ్ త్యోహార్‌కి ఉమంగ్' ఫెస్టివ్ క్యాంపెయిన్‌ను ప్రారంభించినట్లు బ్యాంక్ ఎండీ అండ్ సీఈఓ దేబదత్త చంద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇది ఈ ఏడాది డిసెంబర్ 31 వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. ఫెస్టివల్ ఆఫర్లలో భాగంగా 4 కొత్త పొదుపు ఖాతాలను ప్రారంభించడంతో పాటు అనేక ప్రయోజనాలు, రాయితీలు, హోం, కార్, పర్సనల్, ఎడ్యుకేషన్ లోన్లపై ఆకర్షణీయమైన వడ్డీ రేటు ఆఫర్లు ఉన్నట్లు వెల్లడించారు. అలాగే డెబిట్, క్రెడిట్‌కార్డు హోల్డర్లకు పండగల ఆఫర్లు, డిస్కౌంట్లు అందించడానికి ఎలక్ట్రానిక్స్ ట్రావెల్, ఫుడ్ వంటి రంగాల్లో ప్రముఖ బ్రాండ్‌లతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు చెప్పారు. పండగ సమయంలో గృహ రుణాల ప్రాసెసింగ్ రుసుము పూర్తిగా మాఫీ చేయడంతో పాటు ఏడాదికి 8.4 శాతంతో అత్యంత పోటీ రేటుతో రుణాలను అందిస్తున్నట్లు వివరించారు. అలాగే కార్ లోన్‌లు ఏటా 8.7 శాతం నుంచి, విద్యా రుణాలపై 8.55 శాతం నుంచి ప్రారంభమవుతాయన్నారు. దేశంలో ప్రముఖ విద్యా సంస్థల్లో అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు కొలేటరల్ లేకుండా ఎడ్యుకేషన్ లోన్‌ను 10.10 శాతం నుంచి అందిస్తున్నామన్నారు.

22ఏ నుంచి వుడా లే అవుట్ తొలగింపు

దొండపర్తి: అనకాపల్లి మండలం తుమ్మపాల గ్రామంలో సర్వే నంబర్ 388/1లో 22.38 ఎకరాల భూమిని 22ఏ జాబితా నుంచి తొలగించినట్లు మెట్రోపాలిటన్ కమిషనర్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ భూమిని కొత్తూరు శ్రీ సత్యనారాయణ స్వామి దేవస్థానం నుంచి 1993లో వుడా కొనుగోలు చేసి అందులో 12 ఎకరాల్లో లే అవుట్ వేసి ప్లాట్లను కేటాయించినట్లు వెల్లడించారు. అయితే ఆ సర్వే నంబర్‌ను దేవదాయ శాఖ అధికారులు పొరపాటున 22ఏ జాబితాలో నోటిఫై చేయడంతో సదరు ప్లాట్లను కొనుగోలు చేసిన వారు క్రయవిక్రయాలకు ఇబ్బందులు పడినట్లు చెప్పారు. దీనిపై దేవదాయ శాఖ కమిషనర్‌కు విజ్ఞప్తి చేయగా.. ఆ సర్వే నంబర్‌ను 22ఏ నిషిద్ధ జాబితా నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు వివరించారు. ఈ విషయాన్ని సంబంధిత ప్లాట్ల యాజమానులు గమనించాలని సూచించారు. అలాగే ఆ సర్వే నంబర్‌లో మిగిలిన 10 ఎకరాలను వీఎంఆర్‌డీఏ త్వరలో ఆన్‌లైన్ వేలం ద్వారా విక్రయించాలని నిర్ణయించినట్లు తెలిపారు.

కేజీ వెండి ఆభరణాల అపహరణ

పీఎం పాలెం: ఓ జ్యూయలరీ షాపు నుంచి సుమారు కేజీ బరువు గల వెండి ఆభరణాలు గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. మంగళవారం రాత్రి జరిగిన ఈ చోరీకి సంబంధించి పీఎం పాలెం పోలీస్ స్టేషన్ క్రైమ్ ఎస్ఐ రంభ శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మధురవాడకు చెందిన కందూరి సుబ్బాచారి స్థానిక ఫ్లై ఓవర్ బ్రిడ్జికి సమీపంలో నీలిమ జ్యూయలరీ షాపు నిర్వహిస్తున్నారు. మంగళవారం రాత్రి 9 : 30 గంటలకు ఎప్పటిలాగే షాపు మూసి ఇంటికి వెళ్లిపోయాడు. బుధవారం ఉదయం వచ్చి చూసేసరికి షాపు బలవంతంగా తెరిచినట్టు గుర్తించాడు. లోపలకు వెళ్లి పరిశీలించగా విక్రయానికి సిద్ధం చేసిన సుమారు కిలో బరువు గల వెండి ఆభరణాలు కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన అనంతరం బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

పేడాడ రమణి కుమారికి అభినందనలు



రమణిని సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు

కొమ్మాది: శ్రీకాకుళంలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ యూనివర్సిటీ పాలకవర్గ సభ్యురాలిగా నియమితులైన పేడాడ రమణి కుమారికి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు అభినందించారు. ఎండాడలోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో కష్టపడే వారికి తగిన గుర్తింపు ఉంటుందని, నాయకులనైనా, కార్యకర్తలనైనా ఉన్నత స్థానంలో నిలబెట్టే పార్టీ వైఎస్సార్ సీపీ అన్నారు. కొన్నేళ్లుగా రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర పోషిస్తూ.. సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల మన్ననలు పొందిన పేడాడ రమణి కుమారికి తగిన గుర్తింపు దక్కిందన్నారు. అనంతరం ఆమెను ఘనంగా సత్కరించారు. పార్టీ ఆఫీస్ ఇన్‌చార్జ్ రవిరెడ్డి, జగనన్న మహిళామణుల సొసైటీ ప్రెసిడెంట్ రాధ, రజిని, యువశ్రీ పాల్గొన్నారు.

పాస్టర్ల ఖాతాల్లోకి గౌరవ వేతనం జమ

- క్రీస్తు సంఘాల నాయకుల హర్షం



మాట్లాడుతున్న అద్దేపల్లి రవిబాబు

గాజువాక : రాష్ట్ర ప్రభుత్వం చర్చి పాస్టర్లకు అందిస్తున్న గౌరవ వేతనం వారి బ్యాంకు ఖాతాల్లో జమ అయిందని వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు అద్దేపల్లి రవిబాబు తెలిపారు. గాజువాకలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి, వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. క్రైస్తవ సేవకులను ఇప్పటివరకు ఏ ప్రభుత్వం గౌరవించలేదని.. ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం కుల, మత భేదం లేకుండా అందరూ బాగుండాలని కోరుకుంటున్నారని అన్నారు. దైవ సేవకులు ఆర్థికంగా ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో గౌరవ వేతనం మంజూరు చేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో క్రైస్తవ సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు ఆర్చ్ బిషప్ ఎజ్జల బాలరాజు, విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి కింగ్ డేవిడ్‌రాజు, ప్రతినిధులు జాన్సన్ ఆర్నాల్డ్, బిల్లీగ్రహం, లక్ష్మీనారాయణ, ధనరాజు, కె.జాన్‌బాబు, అశోక్‌బాబు, వై.డేవిడ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

జీఆర్పీ సిబ్బందికి ప్రశంసలు



డీఎస్పార్పీ మోహనరావు నుంచి నగదు బహుమతి అందుకుంటున్న ఎస్ఐ బాలాజీరావు

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేస్టేషన్‌లో గవర్నమెంట్ రైల్వే పోలీసులు గత నెలలో చూపిన ప్రతిభ, ఉత్తమ పనితీరుకు సంబంధించి పలువురు ఎస్ఐలను డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీస్(డీఎస్పార్పీ) బి.మోహనరావు ప్రశంసించారు. ఆగస్టు మొదటి పక్షంలో జీఆర్పీ ఎస్ఐలు బి.అప్పలనాయుడు, వి.బాలాజీరావు రైల్వేస్టేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పలు నేరాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠాల సభ్యులను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి సుమారు 130 గ్రాముల బంగారం, అక్రమంగా తరలిస్తున్న 150 కేజీల గంజాయిలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా జీఆర్పీ డీఎస్పార్పీ మోహనరావు వీరిరువురిని, వీరితోపాటు సహకరించిన సిబ్బందిని అభినందించి, నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ ధనుంజయనాయుడు, జీఆర్పీ సిబ్బంది పాల్గొన్నారు.

బాలుడిని రక్షించిన పోలీసులు



బాలుడు రోహిత్‌ను తండ్రి భరద్వాజ్‌కు అప్పగిస్తున్న సీఐ రమేష్

భీమునిపట్నం: భీమిలి బీచ్‌లో బుధవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన బాలుడిని లైఫ్ గార్డులు రక్షించారు. విజయనగరంలోని ప్రదీప్‌నగర్‌కు చెందిన కొత్తలంక శివసాయి రోహిత్(14) ఇంట్లో తల్లితో గొడవ పడ్డాడు. అనంతరం ఇక్కడి బీచ్‌కు వచ్చి ఆత్మహత్య చేసుకోవడానికి నీటిలోకి దిగుతుండగా గమనించిన బీచ్ మొబైల్ ఏఆర్ ఎస్ఐ జి.ఈశ్వరరావు.. డ్రైవర్ శేషు, లైఫ్‌గార్డుల సహకారంతో రక్షించారు. బాలుడికి సీఐ జి.రమేష్ కౌన్సెలింగ్ ఇచ్చారు. విషయం తెలుసుకుని వచ్చిన తండ్రి భరద్వాజ్‌కు బాలుడిని అప్పగించారు.

యువతి ఆత్మహత్యాయత్నం

బీచ్ రోడ్డు: ప్రేమికుడితో తలెత్తిన వివాదానికి మనస్తాపం చెందిన ఓ యువతి ఆత్మహత్యాయత్నం చేసింది. బుధవారం ఇద్దరు ప్రేమికులు ఆర్కే బీచ్‌కు వచ్చారు. వారి మధ్య గొడవ రావడంతో యువతి సముద్రంలోకి దూకేసింది. వెంటనే ప్రియుడు గట్టిగా అరవడంతో అక్కడ ఉన్న లైఫ్‌గార్డ్స్ ఆమెను రక్షించారు. అనంతరం యువతి తల్లిదండ్రులకు ఫోన్ చేసి సమాచారం అందించారు.

ఎన్‌సీఎస్‌కు బెస్ట్ ఇన్ అకడమిక్స్ ట్రోఫీ

సీతంపేట: నేవీ చిల్డ్రన్ స్కూల్(ఎన్‌సీఎస్) బెస్ట్ ఇన్ అడకమిక్స్ ట్రోఫీ గెలుచుకుంది. హెడ్‌క్వార్టర్స్ ఈఎన్‌సీలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈ వేడుకల్లో సైనిక్ స్కూల్ కోరుకొండ, నేవీ చిల్డ్రన్ స్కూల్, ఏడు కేంద్ర విద్యాలయాలు, విశ్వోదయ హైస్కూల్, సంకల్ప్, లిటిల్ ఏంజిల్స్ స్కూల్ ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. సీ అండ్ సీ ఈవెంట్‌లో చూపిన ప్రతిభతో నేవీ చిల్డ్రన్ స్కూల్ బెస్ట్ ఇన్ అకడమిక్స్ అవార్డుకు ఎంపికైంది. కార్యక్రమంలో ఎన్‌సీఎస్ ఉపాధ్యాయులకు వైస్ అడ్మిరల్ రాజేష్ పెండార్కర్ ట్రోఫీ బహూకరించారు.

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.59,450
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.54,500
వెండి(కిలో):	రూ.77,000

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

బ్రాయిలర్ (లైవ్)	: రూ.152
స్కిన్	: రూ.274
స్కిన్‌లెస్	: రూ.284